నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 12 ఏప్రిల్ 2024 | YADADRI BHUVANAGIRI

## వన్య ప్రాణుల సంరక్షణకు చర్యలు : డీఎఫ్ఓ



నల్లమల అటవీ ప్రాంతంలో నీటి తొట్టిని పరిశీలిస్తున్న డీఎఫ్ఓ సర్వేశ్వర్

చందంపేట, ఏప్రిల్ 11 : వేసవిలో నల్లమల అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు డీఎఫ్ఓ సర్వేశ్వర్ తెలిపారు. మండలంలోని కంబాలపల్లి, రేకులవలయం, చిత్రియాల గ్రామాల సరిహద్దులోని నల్లమల అటవీ ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి తొట్లను పరిశీలించి మాట్లాడారు. వేసవిలో వన్య ప్రాణుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్లను ఏర్పాటు చేసి నీటిని నింపుతున్నట్లు తెలిపారు. ట్రాప్ కెమెరాల ద్వారా జంతువులను గుర్తించి ఆయా ప్రాంతాల్లో వాటి అవసరానికి తగ్గట్లుగా నీటి తొట్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. అటవీ ప్రాంతం నుంచి కలపను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ఎఫ్ఆర్ఓ సాయిప్రకాశ్, భాస్కర్, సెక్షన్ ఆఫీసర్ శ్రీదేవి, రాగ్య, చంద్రకళ ఉన్నారు.

## నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు

- కోదాడ, హుజూర్‌నగర్, ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 11(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశాల్లో బీఆర్ఎస్ దూకుడును ప్రదర్శిస్తున్నది. కాంగ్రెస్, బీజేపీలతో పోలిస్తే ఇప్పటికే నియోజకవర్గాల వారీగా సమావేశాలను ఈ నెల 6వ తేదీ నుంచే మొదలుపెట్టింది. ఇప్పటికే భువనగిరి లోక్‌సభ పరిధిలోని తుంగతుర్తి, మునుగోడు, జనగామ అసెంబ్లీ నియోజకవర్గాల సమావేశాలు, నల్లగొండ లోక్‌సభ పరిధిలోని సూర్యాపేట నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలు పూర్తి చేసింది. కోదాడలో శుక్రవారం ఉదయం 11 గంటలకు, హుజూర్‌నగర్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సమావేశాలు ఏర్పాటు చేసింది. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ముఖ్య నేతలు, కార్యకర్తలందరికీ ఆహ్వానాలు పంపింది. ఇందులో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొననున్నారు. ఇక భువనగిరి లోక్‌సభ పరిధిలో నేడు ఇబ్రహీంపట్నం అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నట్లు తెలిసింది. నేటి నుంచి వరుసగా ఈ నెల 13న ఉదయం నకిరేకల్, మధ్యాహ్నం ఆలేరు, ఈ నెల14న భువనగిరి, ఈ నెల 15న మిర్యాలగూడ, 16న ఉదయం దేవరకొండ, మధ్యాహ్నం నాగార్జున సాగర్ నియోజకవర్గాల సన్నాహక సమావేశాలకు ఇప్పటికే షెడ్యూల్‌ను ప్రకటించారు. స్థానిక మాజీ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో జరుగనున్న ఈ సమావేశాల్లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. కాగా త్వరలో ఉమ్మడి జిల్లా పరిధిలో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రచారం కూడా ఉండనున్నది. మరోవైపు ఈ నెల 19న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం మొదలుకానుంది.

# బత్తాయి ధర ఢమాల్



## టన్ను బత్తాయి ధర రూ.20వేలలోపే

- గతేడాది రూ.35వేల వరకు ధర
- కరువుతో దిగుబడి తగ్గినా రేటేది?
- వ్యాపారుల సిండికేట్ మాయాజాలం
- కొరవడిన ప్రభుత్వ అజమాయిషీ
- సమస్యల సుడిగుండంలో బత్తాయి రైతు

నల్లగొండ జిల్లా బత్తాయి రైతులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే కరువు పరిస్థితులతో తోటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతుండగా, మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు మార్కెట్ మాయాజాలం మరింత కుంగదీస్తున్నది. బత్తాయి రేటు ఇటీవల ఎన్నడూ లేనంతగా పడిపోయింది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర పెంచడానికి ససేమిరా అంటున్నారు. దాంతో ఈ సీజన్‌లో ఒక్కో టన్ను బత్తాయిపై రైతులు రూ.15వేల నుంచి 20వేల వరకు నష్టపోతున్నారు. మార్కెట్ పరిస్థితులపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంపై రైతులు మండి పడుతున్నారు.

– నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 11(నమస్తే తెలంగాణ)

నల్లగొండ జిల్లాలో ఉద్యానవన పంటల్లో బత్తాయి సాగుది అగ్రస్థానం. బోర్లపై ఆధారపడి చేసే వ్యవసాయంతో మెట్ట ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా పండ్ల తోటల సాగుకు ఉపక్రమిస్తారు. సుమారు 35 ఏండ్లుగా ఇక్కడ బత్తాయి తోటలు సాగులో ఉండగా.. 2007–08 కాలంలో అత్యధికంగా 3.4 లక్షల ఎకరాల వరకు విస్తరించింది. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో క్రమంగా అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి విపత్తులతోపాటు కరెంటు సమస్య, మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో దళారుల బెడద అధికమై లాభాలు తగ్గి నష్టాలు వచ్చాయి. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి సాగు 1.50లక్షలకు పడిపోయింది. బత్తాయి సాగులో ఇబ్బందులతో విసిగిపోయిన రైతులు స్వరాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ఉచిత కరెంటు, సమృద్ధిగా సాగునీరు అందుబాటులోకి రావడంతో క్రమంగా వరిసాగు వైపు మొగ్గు చూపారు. దాంతో ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 75 వేల ఎకరాల్లో బత్తాయి తోటలు సాగులో ఉన్నట్లు అంచనా. ఇందులోనూ ప్రస్తుతం దిగుబడి ఇస్తున్న తోటలు 60వేల ఎకరాల వరకు ఉండవచ్చు. ఈ తోటల రైతులు సైతం ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



### భారీగా తగ్గిన ధరలు

బత్తాయిలో కత్తెర, సీజన్ కాయ అని రెండు దఫాలుగా దిగుబడి వస్తుంది. కత్తెరకాయ ఫిబ్రవరి నుంచి మే వరకు, సీజన్ కాయ ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు రెండు దఫాలుగా దిగుబడి వస్తుంది. జిల్లా నుంచి బత్తాయిని హైదరాబాద్‌తోపాటు మెజార్టీ భాగం ఢిల్లీ మార్కెట్‌కు ఎగుమతి చేస్తుంటారు. ఢిల్లీ మార్కెట్ ఆధారంగా ఇక్కడి వ్యాపారులు రేట్ డిసైడ్ చేస్తుంటారు. ప్రస్తుతం కత్తెర కాయ వస్తున్నది. సాధారణంగా కత్తెర కాయకు మార్కెట్‌లో మంచి ధర ఉంటుంది. ఈ సారి మాత్రం ధర పలుకడం లేదు. కత్తెరలో టన్ను బత్తాయికి ఎప్పుడైనా సరే రూ.25వేల నుంచి 40వేల వరకు ధర పలుకడం సహజం. కానీ ప్రస్తుతం రూ.12వేల నుంచి 22వేలకు మించడం లేదు. టన్ను మీద సగం ధర కోల్పోతున్నట్లే. ప్రస్తుత సీజన్‌లో కరువు, నీటి కొరతతో దిగుబడి కూడా అంతంతమాత్రంగానే ఉంది. దిగుబడి లేనప్పుడు మార్కెట్‌లో డిమాండ్ పెరుగాల్సిన తరుణంలో రెగ్యులర్‌గా వచ్చే ధర కూడా రాకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి కూడా రాకుండా తీవ్రంగా నష్టపోతున్నారు.

### మార్కెట్ మాయాజాలం

నల్లగొండ బత్తాయి మార్కెట్లో ఆది నుంచి ప్రైవేట్ వ్యాపారులదే పైచేయి. వారు చెప్పిందే వేదంగా ధర పలుకుతున్నది. జిల్లా బత్తాయి మార్కెట్‌లో మొదటి నుంచి కర్నూల్‌కు చెందిన దళారులదే హవా. తోటల వద్దకే వచ్చి కాయ నాణ్యతను బట్టి టన్ను ధరకు ఇంత అని నిర్ణయిస్తూ కోసుకుపోవడం సహజం. గతేడాది, అంతకు ముందు ఏడాది కత్తెర కాయకు మంచి ధర పలికింది. వ్యాపారులు పోటీ పడి ధర పెంచుతూ పోయారు. 2022 వేసవి కత్తెరలో ఒక దశలో టన్ను ధర రూ.50వేల నుంచి 70వేల వరకు వెళ్లింది. రైతులకు కూడా మంచి లాభం వచ్చింది. గతేడాది కూడా రూ.25వేల నుంచి 40వేల వరకు ధర పలికింది. ప్రస్తుతం కత్తెరలో దిగుబడి తక్కువగా ఉండడంతో పాటు వేసవి, రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో బత్తాయి జ్యూస్‌కు, పండ్లకు మంచి డిమాండ్ ఉంటుంది. ప్రస్తుతం ఢిల్లీ మార్కెట్‌లో మంచి ధరనే ఉన్నట్లు సమాచారం. కానీ రైతులకు మాత్రం స్థానికంగా మంచి ధర దక్కడం లేదు. స్థానికంగా ఉన్న వ్యాపారులే సిండికేట్‌గా మారి ధరలను పెంచవద్దని నిర్ణయించుకున్నట్లు తెలుస్తున్నది. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ఇక ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు సీజన్ కాయ దిగుబడి వస్తుంది. అప్పుడు ఈ మాత్రం రేటు కూడా రాదన్నది వాస్తవం.

### ప్రభుత్వ అజమాయిషీ ఏది?

బత్తాయి రైతులకు అండగా నిలువాల్సిన ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయింది. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో నల్లగొండ శివారులోని ఎస్ఎల్‌బీసీ స్థలంలో బత్తాయి మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. బయట మంచి ధర ఉన్నప్పుడు రైతులకు ఇబ్బంది లేదు. కానీ ధర లేని సమయంలో మార్కెట్ ద్వారా రైతులకు అండగా నిలువాలన్నదే బత్తాయి మార్కెట్ ఉద్దేశం. కానీ అలాంటి చర్యలేవీ కాంగ్రెస్ ప్రభుత్వం వైపు నుంచి కనపడడం లేదు. అందుకే వ్యాపారుల మాయాజాలంలో బత్తాయి రైతులు విలవిలలాడుతున్నారు. ప్రస్తుత ధరల తగ్గింపుపై ఉద్యానవన శాఖ అధికారులు సైతం తమకు కూడా మార్కెట్ పరిస్థితి ఏంటో అంతుచిక్కడం లేదని చెప్పడం గమనార్హం.

### ఏపీలో టన్నుకు రూ.30వేలు.. ఇక్కడ రూ.18వేలే



నీళ్లు లేక బత్తాయి తోటలు ఎండిపోతున్నాయి. వేలకు వేలు ఖర్చు పెట్టి బోర్లు వేయించినా చుక్క నీరు పడే పరిస్థితి లేదు. పోయిన వేసవిలో టన్ను ధర రూ.30 వేలు పలికితే ఇప్పుడు రూ.18 వేలకే కొంటున్నారు. దళారీ వ్యవస్థను అరికట్టేందుకు నేరుగా రైతులే పంట అమ్ముకునేందుకు ప్రభుత్వం సదుపాయాలు కల్పించాలి. పక్క రాష్ట్రంలోని అనంతపురం, కర్నూల్ జిల్లాల్లో టన్ను రూ.30 వేలకు పోతుంటే మన రాష్ట్రంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా దళారులు రూ.18 వేలకే కొంటూ రైతులను మోసం చేస్తున్నారు. ఎంతో కష్టపడి సాగు చేసిన బత్తాయి తోటల రైతులకు ఏమీ మిగలడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి బత్తాయి రైతులను అన్నివిధాలుగా ఆదుకోవాలి.

**- మైలపురపు సుధాకర్‌రెడ్డి, రైతు, కుక్కడం, మాడ్గులపల్లి మండలం**

### పెట్టుబడి కూడా వచ్చేట్టు లేదు



ఈ కత్తెరలో బత్తాయి పంట దిగుబడి సరిగ్గా రాలేదు. రేటు కూడా లేదు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. గతంలో ప్రతి సంవత్సరం సీజన్ క్రాప్‌లో 80 టన్నులు, కత్తెరలో 30–35 టన్నుల దిగుబడి వచ్చేది. ఈసారి మాత్రం టన్ను దిగుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపిస్త లేదు. దానికి తోడు రేటు రూ.15–18 వేలే ఉండడంతో కనీసం పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. గత సంవత్సర ఈ సమయంలో నీరు పుష్కలంగా ఉన్నది. రేటు కూడా 30 వేల వరకు ఉండేది. ఈ సంవత్సరం బోర్లు ఎండిపోవడంతో తోటను కాపాడుకోలేకపోతున్నాం.

**-ఆవుల రవీందర్‌రెడ్డి, రైతు, బట్టుగూడెం, పెద్దవూర మండలం**



## పూలేకు ఘన నివాళి

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆత్మకూర్.ఎంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

## భక్తుల వద్దకే భద్రాచలం తలంబ్రాలు

- రాములోరి గుడికి వెళ్లలేని వారి కోసం ఆర్టీసీ ఏర్పాట్లు

నల్లగొండ సిటీ, ఏప్రిల్ 11 : భద్రాచలం సీతారామచంద్ర స్వామి కళ్యాణ తలంబ్రాలు భక్తుల ఇంటి వద్దకే అందించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. భద్రాచలం వెళ్లలేని భక్తులు కోరుకున్న ప్రాంతానికి ప్యాకెట్లను ఇచ్చేలా చర్యలు చేపట్టింది. ఆర్టీసీ లాజిస్టిక్ సేవల ద్వారా గతం కంటే ఈ సారి ఎక్కువ మందికి తలంబ్రాలు అందజేయాలని ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెల 17నుంచి బుకింగ్స్ ఇవ్వనున్నారు. కావాల్సిన వారు రూ.151 చెల్లించి ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని లాజిస్టిక్ సెంటర్లలో ఈ నెల 18 వరకు ముందస్తు బుకింగ్స్ చేసుకోవచ్చని ఆర్టీసీ అధికారులు తెలిపారు. రాములవారి కళ్యాణం అనంతరం బుకింగ్ చేసుకున్న వారికి తలంబ్రాలను ఇంటి వద్దకే సరఫరా చేస్తారు. సీతారాముల వారి ముత్యాల తలంబ్రాలకు ఎంతో విశిష్టత ఉంది. ఈ తలంబ్రాలను శుభకార్యాలకు అక్షింతలుగా వాడితే రాములవారి అనుగ్రహం ఉంటుందని భక్తుల నమ్మకం. రైతులు తమ వ్యవసాయ పనులు మొదలు పెట్టే ముందు పొలాల్లో వీటిని చల్లుతారు. గత ఏడాది ఒక్కో ప్యాకెట్‌కు రూ.116 ఉండగా, ఈ సారి ఆ ధరను రూ.151కి పెంచింది.



### భక్తులు సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలం సీతారాముల కళ్యాణోత్సవ తలంబ్రాలను భక్తులు పవిత్రంగా భావిస్తారు. అక్కడికి వెళ్లలేని భక్తులకు ఇంటి వద్దే అందించేందుకు ఆర్టీసీ లాజిస్టిక్స్ సెంటర్లలో బుకింగ్స్ ప్రారంభించాం. బుకింగ్స్ చేసుకున్న వారికి సీతారాముల కళ్యాణం అనంతరం వారి ఇంటి వద్దకే పంపించడం జరుగుతుంది. బుకింగ్స్ చేసుకునే భక్తులు తమ ఇంటి చిరునామాతో పాటు ఫోన్ నెంబర్ ఇవ్వాలి. సీతారాముల కళ్యాణ తలంబ్రాల పంపిణీని భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

**– శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం**





భువనగిరిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## భక్తిశ్రద్ధలతో ఈద్ ఉల్ ఫిత్ర్

- ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింలకు ప్రముఖుల శుభాకాంక్షలు

ఆలేరు/భువనగిరి అర్బన్, ఏప్రిల్ 11 : ఈద్ ఉల్ ఫిత్ర్‌ను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కొత్త వస్త్రాలు ధరించి ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. షీర్‌ఖుర్మాతోపాటు పలు వంటకాలను కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా సేవించారు. పేదలకు దానధర్మాలు చేసి పండుగ విశిష్టతను చాటుకున్నారు. బంధుమిత్రుల ఆలింగనాలు, శుభాకాంక్షలతో పల్లెలు, పట్టణాల్లో రంజాన్ శోభ ఉట్టిపడింది. ఆలేరు పట్టణంలోని ఈద్గాలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి పట్టణంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ ముస్లింలతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు.



భువనగిరిలో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్



ఆలేరులోని ఈద్గాలో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తదితరులు

## ఎక్కడి పనులక్కడే.. పునరావాసం ఎప్పటికో!

- నిధులు విడుదల చేసి పనులకు శంకుస్థాపన
- నత్తనడకన సాగుతున్న స్థల అభివృద్ధి పనులు
- అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో మరింత ఆలస్యం
- వెంటనే పూర్తిచేసి ఇవ్వాలని లప్పనాయక్ తండా వాసుల వేడుకోలు

**నృసింహసాగర్ నిర్వాసితులకు 30.11 ఎకరాల స్థలం కేటాయించిన గత ప్రభుత్వం**



యాదగిరిగుట్ట : దాతారుపల్లి సర్వేనంబర్ 294లో కొనసాగుతున్న స్థల అభివృద్ధి పనులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 11 : నృసింహసాగర్ జలాశయం నిర్మాణంలో ఇండ్లు, స్థలాలు కోల్పోయిన లప్పనాయక్ తండా వాసులకు పునరావాసం కోసం గత ప్రభుత్వం కేటాయించిన స్థలంలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. గతేడాది అక్టోబర్ 9న అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరుగగా... ఈ ఏడాది ఫిబ్రవరిలోపు స్థలాన్ని అద్భుతంగా తీర్చిదిద్ది లబ్ధిదారులు ఇండ్లు నిర్మించుకునేందుకు వీలుగా అందిస్తామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు, గుత్తేదారులు హామీ ఇచ్చారు. కానీ పనులు ఆ రేంజ్‌లో జరుగడం లేదు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తమకు కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేసి ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు.

### నిర్వాసితులకు 327 ప్లాట్ల కేటాయింపు

నృసింహసాగర్ జలాయశం నిర్మాణంలో యాదగిరి గుట్ట మండలంలోని లప్పనాయక్ తండా గ్రామం పూర్తిగా ముంపునకు గురైంది. నిర్వాసితులకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా నిలిచింది. అప్పటి సీఎం కేసీఆర్ సర్కారు ఆర్అండ్ ప్యాకేజీ కింద రూ.26.50 కోట్లను కేటాయించింది. మండలంలోని దాతారుపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 294లో 30.11 ఎకరాల్లో నిర్వాసితులకు పునరావాసం, మౌలిక వసతుల కల్పన కోసం చేపట్టే పనులకు 2023, అక్టోబర్ 9న అప్పటి ప్రభుత్వ విప్ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రామంలో 306 ఇండ్లు కోల్పోగా.. బాధితుల్లో 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇవ్వాలన్న లక్ష్యంతో 327 ప్లాట్లను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. పూర్తిగా డీటీసీపీ లే ఔట్ ప్రకారం కాలనీలో 60 ఫీట్ల బీటీ రోడ్డు, 33 ఫీట్ల అంతర్గత రోడ్లను నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. గ్రామంలో స్కూల్ భవనం, గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీ, వైకుంఠధామం, పల్లె ప్రకృతివనంతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించి అద్భుతంగా తీర్చిద్దేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం రూ.1.40 కోట్ల నిధులు కేటాయించగా, విద్యుత్ వసతుల కల్పనకు మరో రూ.60 లక్షలు కేటాయించారు.

### ఎక్కడి పనులు అక్కడే

టెండర్ ప్రక్రియ ద్వారా కాంట్రాక్టర్లను ఎంపిక చేసి పనులను గతేడాది అక్టోబర్ లోనే ప్రారంభించారు. 2024 ఫిబ్రవరి లోగా పునరావాస ప్రాంతాన్ని ఆధునీకరించి నిర్వాసితులకు అందజేస్తామని కాంట్రాక్టర్లు, అధికారులు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు కనీసం స్థలాన్ని చదును చేసే పనులు కూడా పూర్తి చేయలేదు. ఇక ప్రధానంగా 60 ఫీట్ల రోడ్డు విస్తరణ, 33 ఫీట్ల అంతర్గత రోడ్ల నిర్మాణం ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు చూస్తే మరో ఏడాది వరకు పూర్తయ్యే అవకాశం లేదు. ఇప్పటికే జలాశయంలో తమ ఇండ్లు మునిగిపోయాయని, వెంటనే తమకు కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేసి ఇస్తే ఇడ్లు నిర్మించుకుంటామని నిర్వాసితులు చెబుతున్నారు.

### స్థలాన్ని అభివృద్ధి చేసి ఇవ్వాలి



పునరావాసం కింద మాకు కేటాయించిన స్థలాన్ని అభివృద్ధి చేసి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు ఇస్తామని చెప్పిండ్రు. కానీ ఇప్పటివరకు పనులు ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టర్‌ను అడిగితే జూన్ వరకు అందజేస్తామని చెబుతున్నడు.. కానీ పనులు మాత్రం చేస్తలేదు. ఇండ్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం వస్తే మరీ ఇబ్బందిగా ఉంటది. వెంటనే అధికారులు స్పందించి ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ఆధునీకరించి ఇవ్వాలి.

**-ధీరావత్ శంకర్‌నాయక్, నిర్వాసితుడు, లప్పనాయక్ తండా**